క్లుప్తంగా

సింహ వాహనంపై భీమేశ్వరుడు



సంగం: వంగల్లులోని భీమేశ్వరాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం అర్ధరాత్రి దేవదేవేరులు సింహవానంపై భక్తులకు దర్శనమిచ్చారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



అల్లూరు: అల్లూరుపేటలోని షిర్డీ సాయిబాబా మందిరంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాబాకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు.

శ్రీశైలానికి తరలి వెళ్లిన శివమాలధారులు

ఉదయగిరి: మండలంలోని కృష్ణంపల్లె గ్రామానికి చెందిన శివ మాలధారులు సోమవారంశ్రీశైలానికి తరలివెళ్లారు. మండలం రోజుల పాటు కఠోర నియమ నిష్ఠలతో దీక్షను ఆచరించిన శివ భక్తులు స్థానిక శివాలయంలో విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఇరుముడులు ధరించి ప్రత్యేక వాహనంలో శ్రీశైలానికి బయలుదేరివెళ్లారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి



అల్లూరు: ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా పేదలకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళలతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

నేటిలోగా పీ4 సర్వేను పూర్తి చేయాలి

ఉదయగిరి: మండలంలో చేపడుతున్న పీ4 సర్వేను మంగళవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఏ అప్పాజీ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 10,206 గృహాలను సందర్శించి సర్వే చేపట్టాల్సి ఉండగా, సోమవారం వరకు 6,253 గృహాలను సందర్శించి సర్వే చేసినట్లు చెప్పారు. సర్వేకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మార్చి 1 నుంచి క్రాస్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, తదితర సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం: ఉదయగిరిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా సీతారామపురం, కుర్రపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీహరి సోమవారం తెలిపారు.

కాకర్లపై అసత్య కథనాలు తగవు

జలదంకి: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై కొన్ని చానళ్లు, పత్రికలు అసత్య కథనాలు ప్రచురించి అవినీతి మరకలు అంటించాలని చూడడం హాస్యాస్పదంగా ఉందని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బ్రాహ్మణక్రాకలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉదయగిరి అభివృద్ధి కోసం కాకర్ల రాజకీయాల్లోకి వచ్చాడని, ఎమ్మెల్యే కాక ముందే కాకర్ల ట్రస్టు ద్వారా సేవలు అందించారని గుర్తు చేశారు.

వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

అల్లూరు: అల్లూరుపేటలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖలో మహాశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు వజ్రలింగం, నవదుర్గల దర్శనం కల్పించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కే శ్రీదీప సోమవారం తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 93471 11388, 82475 39776 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తీరంలో భూ సేకరణ సెగ

పరిశ్రమల కోసం భూసేకరణకు ప్రభుత్వం చర్యలు

- రైతుల అభిప్రాయాలను తెలుసుకోని అధికారులు
- భూముల సర్వే పేరుతో హడావిడి
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న రైతులు
- ఉద్యమ బాటకు కార్యాచరణ



భూసేకరణ చేస్తున్న భూముల్లో వేరుశనగ పంట

కావలి: కావలి మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల స్థాపన కోసం సుమారు 5వేల ఎకరాలకు పైగా భూముల సేకరణకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. రైతులతో ప్రాథమికంగా చర్చలు జరిపి వారి అభిప్రాయాలను తెలుసుకుని భూసేకరణ ప్రక్రియ పనులను చేపట్టాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రైతులతో మాట్లాడాల్సిన అవసరమే లేదన్నట్లుగా అధికారులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన ఆదేశాలు ఏమి అందాయో చెప్పకుండా సర్వే పనులు చేపడుతున్న కావలి ఆర్డీఓ, తహసీల్దార్‌పై రైతులు గుర్రుగా ఉన్నారు. తమ భూముల్లో, తమకు తెలియకుండా సర్వే చేస్తూ రెవెన్యూ సిబ్బంది దౌర్జన్యపూరితమైన విధానాన్ని అవలంభిస్తున్న తీరుపై రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. రైతులతో కనీసం చర్చలు జరపకుండానే అధికారులు ఇష్టారాజ్యంగా భూసేకరణ కు సంబంధించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. భూసేకరణపై రైతులు కోర్టుకు వెళితే, కోర్టులో కేసులు వీగిపోయేలా చేయడానికి భూసేకరణకు సంబంధించిన అన్ని రకాల నిబంధనలు అనుసరించామని చెప్పుకోవడానికి పకడ్బందీగా ప్రక్రియను అధికారులు చేపడుతున్నారు. దీన్ని పసిగట్టిన రైతులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించుకుని ఉద్యమబాట పట్టడానికి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశారు.



భూముల్లో సాగు చేసిన వరి

ఏడు వేల ఎకరాలపైగా సేకరణే లక్ష్యం

కావలి మండలం ఆనెమడుగు, సర్వాయపాళెం పంచాయతీల పరిధిలో 2,200 ఎకరాలను భూసేకరణ ప్రక్రియ ద్వారా స్వాధీనం చేసుకోవడానికి అధికారులు శరవేగంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయా పంచాయతీల పరిధిలోని గ్రామాల రైతులు కావలి తహసీల్దార్‌పై గుర్రుగా ఉన్నారు. ఆయనే రహస్యంగా అన్ని వ్యవహారాలు నడుపుతున్నారని ఆగ్రహంతో ఉన్నారు. తాము భూములు ఇస్తామని ఎవరికీ చెప్పలేదని, అలాంటప్పుడు ఎలా సర్వే చేస్తారని నిలదీస్తున్నారు. చెన్నాయపాళెం, పెద్దపట్టపుపాళెం, ఆనెమడుగు, సర్వాయపాళెం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో 5,200 ఎకరాలకుపైగా భూములను సేకరించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే పక్కాగా డాక్యుమెంట్లు లేని భూములు మరో 2వేలు ఎకరాల వరకు ఉన్నట్లు సమాచారం. ఇవి ప్రభుత్వానికి ఆయాచితంగా దక్కే అవకాశం ఉంది. ఈ విషయం తెలుసుకున్న రైతులను మరింత కడుపుమండేలా చేస్తోంది.

సర్వేను నిలిపేయండి

కావలి మండలం చెన్నాయపాళెం, పెద్దపట్టపుపాళెం పంచాయతీల పరిధిలో మూడు వేల ఎకరాలకుపైగా భూముల సేకరణకు అధికారులు సర్వేలు చేపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు కావలి ఆర్డీఓ ఎం సన్నీవంశీకృష్ణను కలిశారు. తమ భూములను పరిశ్రమలకు ఇచ్చే ప్రసక్తే లేదని ఖరాఖండిగా చెప్పారు. గ్రామాల్లో సమావేశాలు పెట్టి రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఎలా సర్వే చేస్తారని ఆర్డీఓను ప్రశ్నించారు. సర్వే ప్రక్రియలో పాల్గొంటున్న రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకోవడం జరిగితే మరిన్ని సమస్యలకు దారి తీస్తుందని, రైతుల అభిప్రాయాలు తెలుసుకునే వరకు సర్వే పనులు నిలుపదల చేయాలని కోరారు. భూముల్లో ఏమి పంటలు సాగు చేస్తున్నారు..నిర్మాణాలు ఏమైనా చేశారా, తదితర వివరాలను మాత్రమే సేకరిస్తున్నామని ఆర్డీఓ నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు అంగీకరించలేదు.

ఇదీ రైతుల మనోగతం

- తమతో చర్చించకుండా, తమ ఆమోదం లేకుండా భూసేకరణ ఎలా జరుపుతారు ?
- తరతరాలుగా వ్యవసాయ భూములతో బతుకుతున్న తాము ఎలా బతకాలి ?
- ఏ పరిశ్రమల కోసం భూ సేకరణ చేస్తున్నారు? కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఏర్పాటు చేస్తే తాము ఎలా బతకాలి?
- జీవనోపాధి కోల్పోయే తమకు ఉపాధి ఎక్కడ దొరుకుతుంది? జీవనోపాధి కోసం ఎక్కడికి వలస పోవాలి ?
- వ్యవసాయం, పశుపోషణ, సముద్రంలో చేపల వేటే జీవనాధారం. చదువుకోని తమకు పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇస్తారా?
- తమ భూములను తీసుకుని వాటి చుట్టూ కంచె నిర్మించి తమలను బంధించినట్లుగా చేయడం ఎంత వరకు న్యాయం?
- ప్రజల, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని భూసేకరణపై నిర్ణయం తీసుకోవాలి.
- ప్రభుత్వం ఆదేశించింది, తాము అమలు చేస్తామంటూ అధికారులు మొండికి పోతే మాత్రం ఆందోళన కార్యక్రమాలను ఉద్ధృతం చేస్తాం.

మత్స్యకారుల మనోభావాలను పట్టించుకోరా?



చేపల వేట సక్రమంగా సాగక జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నాం. వేట సాగని సమయంలో పొలం పనులు చేసుకుంటూ బతుకుతున్నాం. భూములు తీసేసుకుంటే గ్రామాల్లో ఎలా ఉండాలి..ఎలా బతకాలి..గ్రామాల చుట్టూ ఉన్న భూములకు కంచె వేస్తే మేము సముద్రానికి ఎలా వెళ్లాలి? సముద్రం కలుషితమైతే చేపలు కూడా దొరకవు. ఈ విషయాలన్నీ అధికారులు గ్రామాల్లోకి వచ్చి మత్స్యకారులతో మాట్లాడితే తెలుస్తుంది. కార్యాలయాల్లో కూర్చుని ఆదేశాలు జారీ చేస్తే మత్స్యకారులు మనోభావాలు ఎలా తెలుస్తాయి?

–నాగన్నగారి శ్రీనివాసులు, మత్స్యకారుడు, పెద్దపట్టపుపాళెం

మా జీవితాలు ఏమైపోవాలి



మా గ్రామానికి దగ్గరలో ఉన్న చేవూరులోని భూములను పరిహారం ఇస్తామని స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత రికార్డులు బాగాలేవని ఇంకా పరిహారం ఇవ్వలేదు. రికార్డులు బాగా లేనప్పుడు అధికారులు భూమిని ఎలా స్వాధీనం చేసుకున్నారు? ఈ పరిస్థితి ఇప్పుడు మా గ్రామాల్లో తలెత్తితే మా జీవితాలు ఏమైపోవాలి? వీటన్నింటికీ అధికారులు సమాధానం చెప్పాలి.

–పత్రి మదన్, రైతు, చెన్నాయపాళెం

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

ఉదయగిరి/దుత్తలూరు/కలిగిరి: ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ హెచ్చరించారు. ఉదయగిరిలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఉదయగిరి సీహెచ్‌సీలోని గండిపాళెం పీహెచ్‌సీకి సంబంధించిన వ్యాక్సినేషన్ నిల్వ కేంద్రాన్ని పరిశీలించి వైద్యారోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. కాగా దుత్తలూరు, కలిగిరి పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై వైద్యాధికారులను ఆరాతీశారు. ఎన్‌సీడీ సర్వే, క్షయ, కుష్టు కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట వైద్యాధికారులు గీతారెడ్డి, శివకల్పన, అయూబ్‌అప్సర్, వనజ, సీహెచ్‌ఓ ఓంకారయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఖాజా మొహిద్దీన్ ఉన్నారు.



ఉదయగిరిలో స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ

రైతులను ఆదుకోవాలని వినతి

కావలి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యానికి మద్దతు ధరను అందించి రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ మాల్యాద్రి, రైతు సంఘ నాయకుడు పీ సీతారామయ్య, కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుడు కే జాన్ కోరారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఎం సన్నీవంశీకృష్ణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జలదంకి, బోగోలు, కావలి మండలాల్లో మిల్లర్లు, దళారులు గతేడాది కంటే ఈ ఏడాది ధాన్యం ధరలను మరింతగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. పుట్టికి సుమారు రూ.5వేల వరకు రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది దిగుబడులు బాగా తగ్గాయని, ఎకరాకు 20 నుంచి 30 బస్తాలు మాత్రమే అవుతుండడంతో కౌలు రైతులు చేతి డబ్బులు వేసి భూ యజమానికి కౌలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు తెరవలేదని, వెంటనే తెరిచి రైతులను ఆదుకోవాలని కోరారు.



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కావలిలో ఆందోళన చేపడుతున్న కార్మికులు



ఆత్మకూరులో..

కావలి/ఆత్మకూరు: కావలి, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కావలి, ఆత్మకూరులోని మున్సిపల్ కార్యాలయాల ఎదుట కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల వేతనాలను పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ నగదును సకాలంలో చెల్లించాలని కోరారు. అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని, ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలివ్వాలని, ఒప్పందం మేరకు యూనిఫామ్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. కావలి నాయకులు ఎం అంకయ్య, యండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, జీ అంకయ్య, పీ శ్రీనివాసులు, కే వేణు, ప్రభావతి, నాగరాజు, ఆత్మకూరు నాయకులు బీ హజరత్తయ్య, షేక్ మునీర్ బాషా, కే నాగేంద్ర, డీ వాసు, కుంటా పెంచలయ్య, ఎం చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం కార్మికుల ఆందోళన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చంద్రపడియలో ఉన్న వెంకటనారాయణ ఆక్టివ్ ఇన్‌గ్రేడియస్(వీఎన్‌ఏఐ)లో పని చేస్తున్న కార్మికులు వేతనాల కోసం సోమవారం నిరసన కార్యక్రమంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, పీఎఫ్‌లోనూ చేర్చలేదని అవేదన వ్యక్తం చేశారు. జీతాలపై ఆధారపడి బతుకుతున్నామని, నెలలు తరబడి ఇవ్వకపోతే ఎలా బతకాలని మీడియా ఎదుట వాపోయారు. కాగా కంపెనీ హెచ్‌ఆర్ నిరసనకు దిగుతున్న కార్మికుల వద్దకు వచ్చి బెదిరింపు ధోరణితో మాట్లాడారు. మన సమస్యను మనమే పరిష్కారించుకోవాలే తప్పు మీడియాకు ఎందుకు చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే తొలగించి వేరే వారిని నియమించుకుంటామని హెచ్చరించారు. దీంతో కార్మికులు భయపడి పరిశ్రమ లోపలికి వెళ్లారు. కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు కాంట్రాక్టరును నియమించామని, అతనితో మాట్లాడి ఇప్పిస్తామని హెచ్‌ఆర్ చెబుతున్నారు. కానీ ఇదే మాట రెండు నెలలుగా చెబుతున్నారని, వేతనాలు మాత్రం ఇవ్వడం లేదని, త్వరలోనే కంపెనీ వేరే యాజమాన్యం చేతిలోకి వెళుతుందనే ప్రచారం ఉందని, కొత్త వారు వస్తే ఇంత వరకు ఇవ్వాల్సిన వేతనాలు పెండింగ్ పెట్టే అవకాశం ఉందని కార్మికులు వాపోతున్నారు.



నిరసనకు దిగిన కార్మికులను బెదిరిస్తున్న పరిశ్రమ హెచ్‌ఆర్

గండిపాళెం పాఠశాలలో డిప్యూటీ డీఈఓ విచారణ

ఉదయగిరి: గండిపాళెం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో వంట చేయిస్తున్న వైనంపై 'సాక్షి'లో 'విద్యార్థులే వంట మాస్టర్లు' శీర్షికతో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి ఎం జానకిరాం సాయంత్రం గురుకుల పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్‌ను విడివిడిగా విచారించారు. నివేదికను డీఈఓకు పంపనున్నారు.

రుణాల రికవరీపై దృష్టి సారించాలి

ఉదయగిరి: పొదుపు సభ్యులు వివిధ పథకాల ద్వారా తీసుకున్న రుణాల రికవరీపై సీసీలు ప్రత్యేక దృష్టి సారించాలని వెలుగు ఏపీఎం ఖాజారంతుల్లా సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీడీఓ అప్పాజీతో కలిసి ఆయన ఈసీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. మార్చి నెలాఖరుకు నూరు శాతం రికవరీ సాధించాలన్నారు. అర్హత కలిగిన గ్రూపులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాల్లో పొదుపు సంఘాల సభ్యులను భాగస్వాములు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ కరీముల్లా పాల్గొన్నారు.

ఆంజనేయరాజుకు కళాంజలి పురస్కారం



అల్లూరు: అల్లూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు బడబాగ్ని ఆంజనేయరాజు కళాంజలి ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. నెల్లూరులోని పురమందిరంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కళాంజలి సంస్థ అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేసి సత్కరించింది.

జిల్లాస్థాయి పోటీలకు వెన్నవాడ విద్యార్థిని

ఆత్మకూరురూరల్: పాఠశాల విద్యాశాఖ, విభా సంయుక్తంగా నిర్వహిస్తున్న వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో వెన్నవాడ పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థిని నైనిక ప్రతిభకనబర్చింది. విభా టీం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన పాఠశాల స్థాయి పోటీల్లో నైనిక సత్తా చాటి జిల్లా స్థాయికు ఎంపికైనట్లు హెచ్‌ఎం కలిశెట్టి రవీంద్రకుమార్ తెలిపారు. ఈ నెల 27న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నైనికను హెచ్‌ఎంతో పాటు ఎస్‌ఎంసీ చైర్మన్ లావణ్య, ఉపాధ్యాయిని జీవని, సోమవారం అభినందించారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

ఉదయగిరి: ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శైవక్షేత్రాలకు ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నామని డీఎం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఉదయగిరి డిపో పరిధిలోని సిద్ధేశ్వరం, ప్రకాశం జిల్లా పరిధిలోని భైరవకోన, మిట్టపల్లి నారాయణ స్వామి క్షేత్రాలకు 19 సర్వీసులను నడుపుతున్నామని చెప్పారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉదయగిరి: మార్చి 1 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎం వాసు, డిపార్ట్‌మెంటల్ అధికారిణి పీ జమున తెలిపారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సోమవారం పోలీసు స్టేషన్‌కు చేరగా వారు పరిశీలించి ప్రత్యేక బాక్సుల్లో ఉంచి సీల్‌వేసి స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో సుమారు 700 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అందుకోసం 14 గదులు ఏర్పాటు చేసి 15 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైన అనుమతించమని తెలిపారు.

ఆత్మకూరు: ఇంటర్ ఒకేషనల్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సోమవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది పరిశీలించి ప్రత్యేక బాక్సుల్లో ఉంచి సీల్‌వేసి సీఐ జీ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లోని స్ట్రాంగ్‌రూములో భద్రపరిచారు.



ఉదయగిరిలో ప్రశ్నాపత్రాల బాక్సులను పరిశీలిస్తున్న అధికారులు

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

బిట్రగుంట: బోగోలు మండలంలో సామాజిక పింఛన్లు పొందేందుకు అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ వెంటనే కొత్తవి మంజూరు చేసేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరరఘు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులైన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, వైస్‌ఎంపీపీ మద్దిబోయిన పద్మ, సీనియర్ నాయకులు పత్రి అంకులయ్య, జిల్లా అధికార ప్రతినిధి మేకల శ్రీనివాసులు, కావలి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



కలిగిరి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సరస్వతి పూజను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా కలిగిరి శాఖ మేనేజర్ సతీష్‌కుమార్ క్రీడల్లో రాణిస్తున్న 20 మంది విద్యార్థినులకు క్రీడా దుస్తులు అందజేశారు. కలిగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటశేషయ్య పరీక్ష సామగ్రి అందజేశారు. ఎంఈఓ జీ సురేష్‌బాబు, ప్రిన్సిపల్ సుప్రియ, జేవీవీ నాయకుడు మేడం నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్ధనకొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మీకాంతం ఎస్‌ఎంసీ చైర్మన్ అంబటి మాల్యాద్రి ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

దాచేపల్లి: శ్రీచైతన్య టెక్నో స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నడికుడి బ్రిడ్జి వద్ద సోమవారం జరిగింది. నెల్లూరు జిల్లా కావలి మండలం ముసునూరుకు చెందిన ఉప్పుగోపాల్ (32) మృతి చెందాడు. ఎస్సై పాపారావు తెలిపిన వివరాల మేరకు.. నడికుడి బ్రిడ్జి వద్ద రోడ్డు పనుల్లో గోపాల్ పనిచేస్తున్నాడు. రోడ్డుపై స్టిక్కర్లు అంటిస్తున్న సమయంలో నారాయణపురంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ బస్సు అతనిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను పిడుగురాళ్లలోని ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యంలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడికి తీవ్రగాయాలు

కావలి: పట్టణంలోని ముసునూరులో ఆదివారం సాయంత్రం రోడ్డు దాటుతున్న మాజీ సైనికుడిని బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు సోమవారం కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు కొమ్మాలపాటి వెంకట్రావు (67) కావలి పట్టణంలోని ముసునూరులో ఉంటున్న తన చెల్లెలు వద్దకు వచ్చారు. ఆదివారం సాయంత్రం రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పుచ్చ పంటను నాశనం చేశారని ఫిర్యాదు

మర్రిపాడు: స్థానిక ఫైర్‌స్టేషన్ సమీపంలో నెల్లూరు-ముంబై జాతీయ రహదారి పక్కన ఎకరా పొలంలో తాను సాగుచేసిన కర్రపుచ్చ చెట్లపై కొందరు కలుపు మందు పిచికారీ చేసి నాశనం చేశారని రైతు గంగినేని సుగుణమ్మ మర్రిపాడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వేంపాటి వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి నలుగురిని తీసుకొచ్చి పొలంలో ఎవరూ లేని సమయంలో గేటు తాళం పగులగొట్టి కలుపు మందు పిచికారీ చేసి పంటను నాశనం చేశారని అందులో పేర్కొన్నారు. అలాగే రోలార్ బాక్స్ ప్లేట్లు, మోటార్ కేబుల్ వైర్లు అపహరించుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు.